‘6, 7 తరగతులకు’ నిక్కర్లకు బదులు ప్యాంట్లు

- తాజాగా ఆదేశాలిచ్చిన పాఠశాల విద్యాశాఖ
- నిక్కర్ల విషయాన్ని వెలుగులోకి తీసుకొచ్చిన ‘నమస్తే తెలంగాణ’

హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని 6,7 తరగతుల్లోని బాలురకు నిక్కర్లకు బదులుగా ప్యాంట్లు కుట్టించి ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ తాజాగా నిర్ణయించింది. 2025-26 విద్యాసంవత్సరంలో 19,91,986 మంది విద్యార్థులకు ఉచిత యూనిఫారాలు ఇవ్వనున్నారు. 1-7 తరగతుల్లోని బాలురకు నిక్కర్లు, 8 నుంచి 12వ తరగతి అబ్బాయిలకు ప్యాంట్లు కుట్టించి ఉచితంగా ఇస్తున్నారు. 6,7 తరగతుల్లోని బాలురులు నిక్కర్లు ధరించడానికి ఇష్టపడటం లేదు. నిక్కర్లను విద్యార్థులు ధరించడంలేదని, బదులుగా ప్యాంట్లు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాలు కూడా చాలా కాలంగా కోరుతున్నాయి. ఆయా అంశాలను ప్రస్తావిస్తూ ఇటీవలే నమస్తే తెలంగాణ ‘6, 7 తరగతులకు ఇంకా నిక్కర్లేనా’ అన్న శీర్షికతో వార్తను ప్రచురించింది. స్పందించిన పాఠశాల విద్యాశాఖ శనివారం 6,7 తరగతులకు ప్యాంట్లు కుట్టించి ఇవ్వాలని ఆదేశించింది. కావాల్సిన వస్త్రాన్ని సమకూర్చాలని టెస్కోకు, ప్యాంట్లు కుట్టించి ఇవ్వాలని మెప్మా, సెర్ప్‌లకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి శనివారం లేఖలు రాశారు. ఈ నిర్ణయంపై తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేసన్ (టీఎస్‌జీహెచ్‌ఎం) మాజీ రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాశ్ హర్షం వ్యక్తంచేశారు.

6,7 తరగతులకు ఇంకా నిక్కర్లే..!

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : నిక్కర్లు వద్దంటూ విద్యార్థులు మొత్తుకుంటున్నా.. విద్యార్థులు తీసుకోవడం లేదని హెచ్ఎంలు మొత్తుకుంటున్నా వచ్చే విద్యాసంవత్సరంలో సైతం 6,7 తరగతుల్లోని వారికి విద్యాశాఖ నిక్కర్లే ఇవ్వనున్నది. పాత యూనిఫారాల డిజైన్‌ను సైతం మార్చారు. వస్త్రం తక్కువయ్యేలా వీటి డిజైన్ రూపొందించారు. గతంలో ఆకట్టుకునేలా, ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు ధరిస్తున్నట్టుగా యూనిఫారాలు ఇవ్వడంలో భాగంగా విభిన్న డిజైన్‌లతో యూనిఫారాలను అందించారు. కానీ వచ్చే ఏడాదిలో డబ్బులు మిగిల్చుకునేందుకు విద్యాశాఖ వస్త్రం తక్కువయ్యేలా డిజైన్లను మార్చింది.

విద్యార్థుల వివరాలు..

తరగతి	విద్యార్థులు	ఒక జతకు అవసరమయ్యే వస్త్రం
6వ	92,448	150 సెం. మీ.
7వ	92,448	150 సెం. మీ

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తొలగింపు

- దళితబంధుకు ‘కన్నం’ పై దిద్దుబాటు
- ‘నమస్తే తెలంగాణ’ కథనానికి స్పందన

కరీంనగర్, మార్చి 29(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : దళితబంధు పథకాన్ని సొమ్ము చేసుకోవడానికి కొంత మంది అధికార పార్టీ నేతలు ప్రయత్నిస్తున్న తీరుపై ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగింది. లబ్ధిదారుల యూనిట్ల కొనుగోలు విషయంలో కమీషన్లకు సంబంధించి.. ఉత్తర తెలంగాణకు చెందిన ఓ మంత్రి అధికారులతో కలసి నడుపుతున్న బాగోతాన్ని ఎండగడుతూ.. దళిత బంధుకు ‘కన్నం’! లబ్ధిదారులకు ఇచ్చే నిధుల్లో ఓ అమాత్యుడి కమీషన్ల వేట శీర్షికతో ఈ నెల 27న ‘నమస్తే తెలంగాణ’ మెయిన్‌లో ప్రచురించిన విషయం తెలిసిందే. దళిబంధు యూనిట్లు గ్రౌండింగ్ చేయడానికి బేరసారాలు చేస్తున్న వైనం.. చెప్పిన యూనిట్ తీసుకోవాలంటూ చేస్తున్న ఒత్తిళ్లు.. మార్గదర్శకాలను తుంగలో తొక్కి వసూళ్లకు పాల్పడుతున్న పర్వం వంటి పలు అంశాలను కథనం ద్వారా ‘నమస్తే’ వెలుగులోకి తెచ్చింది. ఈ కథనంపై స్పందించిన అధికార యంత్రాగం.. దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వినోద్‌ను తొలగించి, మైనార్టీ వెల్ఫేర్ అధికారి పవన్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగిస్తూ కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి శనివారం ఆదేశాలు జారీ చేశారు. దళితుల అభ్యున్నతే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో హుజూరాబాద్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ప్రకటించి, 18 వేల మందికి రూ.10 లక్షల చొప్పున వారి ఖాతాల్లో జమచేశారు. వీరిలో అత్యధికులు యూనిట్లు స్థాపించుకోగా, కొంతమంది ఖాతాల్లోని నిధులు డ్రా చేసుకుంటున్న క్రమంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో 7,634 మందికి చెందిన రూ.281.84 కోట్లు బ్యాంకుల్లోనే ఉండిపోయాయి. ఎన్నికల అనంతరం నిధుల విడుదలపై అధికారుల నిర్లక్ష్యంపై బీఆర్ఎస్ ఆందోళనలు చేపట్టింది. ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో ఖాతాలపై ఫ్రీజింగ్ ఎత్తేసి, నిధులు విడుదల చేయాలని జనవరి 28న కలెక్టర్‌ను ఆదేశించింది.

దళితబంధుకు ‘కన్నం’!

లబ్ధిదారులకు ఇచ్చే నిధుల్లో ఓ అమాత్యుడి కమీషన్ల వేట

- అనుకూల అధికారి సాయంతో బేరసారాలు
- చెప్పిన యూనిట్ తీసుకోవాలంటూ ఒత్తిడి
- అయిలేనే బకాయిలు చెల్లిస్తామని హుకుం
- ఒక్క కరీంనగర్ జిల్లాలోనే 7వేల మందికి చెందిన రూ.281 కోట్ల నిధులపై కన్ను

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): దళిత బంధు లబ్ధిదారులను కాంగ్రెస్ సర్కారు ఆది నుంచీ అనేక ఇక్కట్లపాలు చేస్తున్నది. నిన్నమొన్నటి దాకా నిధులు విడుదల చేయకుండా ముప్పుతిప్పలు పెట్టింది. రోడ్డెక్కి పోరాటాలు చేస్తేకానీ అంగీకరించలేదు. బీఆర్ఎస్ నేతలు, దళిత బంధు లబ్ధిదారుల పోరాటంతో ఎట్టకేలకు దిగివచ్చింది.

వర్సిటీలపై సర్కారు పెత్తనమేంది?

- ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలపై నిషేధం ఎందుకు?
- ప్రభుత్వ ఒత్తిడితోనే వేధిస్తున్నారని విద్యార్థుల ఆగ్రహం
- హక్కులపై ఆంక్షలేంటని మాజీ వీసీలు, ప్రొఫెసర్లు ఫైర్

హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ): ఉస్మానియా యూనివర్సిటీ.. తెలంగాణ సమాజంలో ఉద్యమాలకు పురిటిగడ్డ. ప్రజాగొంతుకగా నిలిచిన వేదిక. కానీ కాంగ్రెస్ సర్కారు విద్యార్థుల గొంతులను అణచివేస్తున్నదని విద్యార్థి సంఘాలు తీవ్రఅభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. హక్కుల గోసం గొంతెత్తకుండా కుట్రలు చేస్తున్నారని విద్యార్థులు మండిపడుతున్నారు. సర్క్యులర్లతో హక్కులను కాలరాయడం కరెక్ట్ కాదని మాజీ వీసీలు, ప్రొఫెసర్లు, విద్యార్థులు మండిపడుతున్నారు.

ఇలాంటి సర్క్యులర్లు అవసరం లేదు

యూనివర్సిటీలో తమ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు నిరసనలు తెలుపుతారు. ఉన్నత విద్యా సంస్థలలో ఇలాంటివి అవసరమే. వాటిని నియంత్రించాలనుకోవడం సమంజసం కాదు. రాజ్యాంగపరంగా విద్యార్థులు తమ హక్కుల సాధన కోసం నిరసనలు తెలుపుకోవచ్చు. వాటికి నిషేదాజ్ఞలు ఎక్కడా లేవు.

- ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్

విద్యార్థులను రెచ్చగొట్టినట్టే

తెలంగాణ ఉద్యమ సమయంలో ఓయూలో విద్యార్థులు, అధ్యాపకులు కూడా పాల్గొన్నారు. ఆర్ట్స్ కాలేజీ వేదికగా చాలా సభలు జరిగాయి. ఇలాంటి సర్క్యులర్లు తీసుకురావడం వల్ల విద్యార్థులను మరింతగా రెచ్చగొట్టినట్టే అవుతుంది. ఇలాంటి సర్క్యులర్ల వల్ల అనర్థాలే తప్ప, మంచి జరుగదు. ఈ విషయాన్ని బాధ్యులు ఎవరైనా గ్రహించాల్సిన అవసరం ఉంది.

-ప్రొ. సత్యనారాయణ, ఓయూ మాజీ వీసీ

నిరసన తెలుపుకోవచ్చు

సమస్యలు పరిష్కారం కోసం ఆందోళనలు చేసే హక్కులు విద్యార్థులకు ఉంటాయి. విద్యార్థులు తమ భావాలను వ్యక్తపరుచుకోవచ్చు. రాజ్యాంగబద్ధంగా నిరసనలు తెలుపుకోవచ్చు. ఇలాంటి సర్క్యులర్లు జారీ చేయడం సమంజసం కాదు. విద్యార్థులు యూనివర్సిటీ ఆస్తులకు నష్టం వాటిల్లకుండా ఉన్నంతవరకు నిరసనలు తెలుపుకునే హక్కులు ఉంటాయి.

- రవీంద్రయాదవ్, ప్రొఫెసర్

నిరసనలపై నిషేధం అని చెప్పలేదు

యూనివర్సిటీలో విద్యార్థులు నిరసనలు తెలపకూడదని చెప్పలేదు. వీసీ చాంబర్లు, రిజిస్ట్రార్ కార్యాలయాలు, డీన్లు, ప్రిన్సిపాళ్ల రూమ్‌లలో నిరసనలు చేయవద్దు అని మాత్రమే చెప్పాం. సర్క్యులర్‌లో కూడా అదే ఉంది. కానీ దానిని కొంత మంది విద్యార్థులు తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఈ అంశం హైకోర్టులో ఉంది. కోర్టు నిర్ణయం తర్వాత మా నిర్ణయం ఉంటుంది.

- ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, ఓయూ వీసీ

రేవంత్‌పై ఎన్ఎస్‌యూఐ ఫైర్

- గుంటనక్కవ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం
- భూములు కాపాడుతామని ఎన్ఎస్‌యూఐ ప్రతిన

హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ): కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల్లో జంతుజాలం, పశుపక్ష్యాదులు లేవంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన దారుణ వ్యాఖ్యలను నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నట్టు ఎన్ఎస్‌యూఐ పేర్కొంది. భూముల విక్రయాన్ని వ్యతిరేకిస్తున్న విద్యార్థులను, పర్యావరణవేత్తలను ‘గుంట నక్కలు’ అన్న సీఎం వ్యాఖ్యలు బాధ్యతారహితం, పర్యావరణ పరిరక్షణపై దాడిగానే భావిస్తాం అని శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. పులులు, జింకల వంటి భారీ క్షీరదాలు లేనంత మాత్రాన ఆ భూములను వేలం వేయవచ్చన్న సీఎం వాదన అశాస్త్రీయమని పేర్కొంది. పర్యావరణ పరిరక్షకులను గుంట నక్కలు అని ఎగతాళి చేసి సీఎం తమ నోరు మూయించలేరని తేల్చిచెప్పింది. సీఎం నోటి వెంట ఇవేం వ్యాఖ్యలంటూ మండిపడింది. ఈ 400 ఎకరాల్లో 734 వృక్ష, 220 పక్షి జాతులు, అనేక సరీసృపాలు, నక్షత్ర తాబేళ్లు, మచ్చల జింకలు, అడవిపందులు, కుందేళ్లు ఉన్నాయని పేర్కొన్నది. పర్యావరణానికి హాని కలిగిస్తే మౌనంగా ఉండలేమని తేల్చిచెప్పింది. గచ్చిబౌలిలో జీవవైవిధ్యాన్ని కాపాడాలనే పోరాటానికి ఎన్ఎస్‌యూఐ (హెచ్‌సీయూ) పూర్తి మద్దుతు తెలుపుతుందని స్పష్టంచేసింది. ఈ భూముల వేలం నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, సీఎం తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది.

పాలం పాక్కిలి!

- సాగు చేసింది 42 వేల ఎకరాలు
- ఎండింది 38 వేల ఎకరాలు
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ సతీమణి పద్మావతి సెగ్మెంట్‌లో దుర్భర పరిస్థితులు
- ఎండిన పంటల వైపు కన్నెత్తి చూడని ఉత్తమ్, పద్మావతి

మోతె మండలం లాల్‌తండాలో నెర్రెలు బారిన వరి పొలం

సూర్యాపేట, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : స్వయాన నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సతీమణి ఎమ్మెల్యే పద్మావతి ప్రాతినిధ్యం వహిస్తున్న కోదాడ నియోజకవర్గంలో గోదావరి జలాలు చుక్క కూడా అందడం లేదు. ఈ నియోజకవర్గం పరిధిలోని మోతె, నడిగూడెం, మునగాల మూడు మండలాలకు కాళేశ్వరం పరిధిలోని ఎస్సారెస్పీ ఆయకట్టు కింద 42వేల ఎకరాలు రైతులు సాగు చేయగా, దాదాపు 38 వేల ఎకరాల్లో పంట ఎండిపోయింది. కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఎండిన పంటలను పరిశీలించి రైతులకు ధైర్యం చెప్తున్నా.. మంత్రి ఉత్తమ్ గానీ, ఎమ్మెల్యే పద్మావతి గానీ కనీసం రైతులను పరామర్శించలేదు. సూర్యాపేట జిల్లాలో దాదాపు లక్షకు పైగా ఎకరాల్లో వరి ఎండిపోతుంటే రాజకీయాలకు సంబంధం లేని పాలనా యంత్రాంగం కూడా పట్టించుకోవడం లేదు. నీళ్లిస్తాం.. పంటలు వేసుకోండని ప్రభుత్వం చెప్పడంతో గత బీఆర్ఎస్ హయాంలో వచ్చినట్లే నీళ్లు వస్తాయనుకుని సూర్యాపేట జిల్లాలోని నాగార్జునసాగర్ ఆయకట్టుతోపాటు ఎస్సారెస్పీ ఆయకట్టు రైతాంగం వరి నాటింది. నాగార్జునసాగర్ ఆయకట్టుకు పెద్దగా ఇబ్బంది లేకపోగా, ఎస్సారెస్పీ ఆయకట్టు రైతులు నిండా మునిగారు. మంత్రి ఉత్తమ్ సతీమణి పద్మావతి ప్రాతినిధ్యం వహిస్తున్న కోదాడ నియోజకవర్గంలో పరిస్థితి ఘోరంగా తయారైంది. మోతె, నడిగూడెం, మునగాల మండలాల్లో వేలాది ఎకరాల్లో వరి పైర్లు ఎండాయి. ప్రభుత్వం ఒక్క తడి నీళ్లు ఇచ్చినా పంట చేతికి వచ్చేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒక్క తడికి నీళ్లిచ్చినా పంట చేతికి వచ్చేది

నాకున్న నాలుగెకరాలతోపాటు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని వరి నాటు పెట్టిన. సాగు నీరు రాకపోతే మూడు బోర్లు వేసిన. రెండు బోర్లల్లో కొద్దిగా నీళ్లు వస్తుంటే రేయింబవళ్లు ఉండి నాలుగెకరాలను కాపాడుకుంటూ వచ్చిన. పదిహేను రోజుల సంది బోర్లు పోస్తలేవు. మొత్తం పంటంతా ఎండింది. వరి ఈని గింజ పోసుకుంటున్న టైమ్‌లో నీళ్లు లేక ఆగమైనం. ఒక్క తడికి నీళ్లిచ్చినా పంట చేతికి వచ్చేది. ఇదివరకు కేసీఆర్ హయాంలో రెండు సీజన్లు రంది లేకుండా నీళ్లు వచ్చినయి. తెలంగాణ రాక మునుపు ఎట్ల ఉండెనో ఇప్పుడట్ల ఉంది పరిస్థితి. పొలాలు నెర్రెలు బారినయ్. మాయదారి ప్రభుత్వం మమ్మల్ని ఉంచేందుకు వచ్చిందో.. ముంచేందుకు వచ్చిందో తెలుస్తలేదు. ఎండిన పంటకు నష్టమైనా కట్టిస్తే బాగుంటది.

-బాణోతు వీరన్న, లాల్‌తండా, మోతె మండలం

హిమాచల్‌లో విద్యుత్తు ప్లాంట్లు ఎవరి కోసం?

- 520 మెగావాట్ల హైడల్ ప్లాంట్లను నెలకొల్పనున్న తెలంగాణ సర్కారు
- రాష్ట్రం బయట కొత్త ప్లాంట్లు ఏర్పాటు చేయడంపై అనుమానాలు
- మరి ఎవరి లబ్ధి కోసం ప్లాంట్?

హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ): ప్రాథమిక అధ్యయనం చేయకుండా.. ఫీజిబిలిటీ రిపోర్ట్ లేకుండా.. డీపీఆర్ రూపొందించకుండా.. కనీసం బోర్డు ఆమోదం తీసుకోకుండా తెలంగాణ జెన్‌కో హిమాచల్ ప్రదేశ్‌లో జల విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు పరుగులు పెట్టింది. 520 మెగావాట్ల జల విద్యుత్తు ప్లాంట్లను హిమాచల్ ప్రదేశ్‌లో నెలకొల్పేందుకు శనివారం ఒప్పందం కుదుర్చుకున్నది. ఆ రాష్ట్రంలోని సెలిలో 400 మెగావాట్లు, మియార్‌లో 120 మెగావాట్ల జలవిద్యుత్తు ప్లాంట్లను నెలకొల్పేందుకు హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమక్షంలో శనివారం ఎంవోయూ జరిగింది. అయితే ఈ ఒప్పందంపై విద్యుత్తు రంగ నిపుణులు పెదవి విరుస్తున్నారు. ఈ ప్రాజెక్టు అంత అనుకూలం కాదని, ఫలితంగా జెన్‌కో నష్టపోయే ప్రమాదముందని, దీని భారం అంతిమంగా రాష్ట్ర ప్రజలపై పడుతుందని హెచ్చరిస్తున్నారు. అత్యంత గోప్యంగా, హడావుడిగా ఎంవోయూ కుదర్చుకోవడం ఎందుకనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇక్కడ కాదని అక్కడెందుకని పేర్కొంటున్నారు.

దుమ్ముగూడెంలో అవకాశమున్నా..

మన రాష్ట్రంలోని దుమ్ముగూడెంలో జల విద్యుత్తు ప్లాంట్ నిర్మాణానికి అన్ని రకాల అవకాశాలున్నాయి. దీంతో ఇక్కడి ప్రాజెక్టును వదిలిపెట్టి, హిమాచల్‌ప్రదేశ్‌కు పరుగులు పెట్టడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో 6,485.26 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను జెన్‌కోయే నిర్మించింది. రాష్ట్రం బయట ప్లాంట్‌ను నిర్మించడం ఇదే తొలిసారి. ఏదైనా ప్లాంట్‌ను నిర్మించే ముందు ఓ ఏజెన్సీ ద్వారా ఫీజిబిలిటీ రిపోర్ట్‌ను తయారు చేస్తారు. ఆ తర్వాత డీపీఆర్‌ను రూపొందిస్తారు. కానీ, హిమాచల్ ప్లాంట్ల విషయంలో ఇవేవి జరగలేదు.

అభ్యంతరాలు.. ప్రశ్నలివే..

- హిమాచల్‌ప్రదేశ్ 8-9 నెలలు మంచు ఉంటుంది. ఈ మంచు నీరుగా మారేదెప్పుడు.. విద్యుత్తు ఉత్పత్తి అయ్యేదెప్పుడు? అన్న ప్రశ్నలు తలెత్తున్నాయి.
- తాజా అంచనాల ప్రకారం జల విద్యుత్తు కేంద్రాల నిర్మాణానికి ఒక మెగావాట్‌కు రూ.8-9 కోట్లు వ్యయమయ్యే అవకాశముంది. అంటే వీటి నిర్మాణానికి దాదాపు రూ.4,680 కోట్ల వ్యయం అవుతుంది. దీంట్లో హిమాచల్‌ప్రదేశ్ వాటా ఎంత? తెలంగాణ వాటా ఎంత? అనేది తెలియదు.
- ఖరీదు తక్కువని మన దగ్గరున్న హైడల్, థర్మల్ ప్లాంట్లను బ్యాక్‌డౌన్ చేసి (నడపకుండా) బయటి నుంచి సోలార్ విద్యుత్తును యూనిట్‌కు రూ.2.72- 2.82లకు కొనుగోలు చేస్తున్నారు. మరి ఇలాంటప్పుడు హిమాచల్‌లో ప్లాంట్ పెట్టి లాభమేంటి? అన్న సందేహాలు ఉన్నాయి.

హెలికాప్టరా? పల్లెవెలుగు బస్సా?

- హెలికాప్టర్ లేకుండా ఎటూవెళ్లలేక పోతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్
- హైదరాబాద్ నుంచి సూర్యాపేటకు కూడా హెలికాప్టర్‌లోనే ప్రయాణం
- ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని ప్రజల ఆగ్రహం
- రెండు కిలోమీటర్ల దూరానికీ హెలికాప్టర్ ఏంటని ప్రశ్నలు
- మంత్రికి గాలిమోటర్ మోజు ఎక్కువైందని విమర్శల వెల్లువ
- పల్లెవెలుగు బస్సు కంటే దారుణమైందంటూ వ్యంగ్యాస్త్రాలు
- రాష్ట్రం దివాలా తీసిందంటూనే ఆడంబరాలేంటని నిలదీత

సూర్యాపేట, మార్చి 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హెలికాప్టర్ సదుపాయం ఉంటుంది. గవర్నర్, ముఖ్యమంత్రి, కీలక అధికారులు అత్యవసర, దూర, మారుమూల ప్రాంతాల పర్యటనల కోసం ఉపయోగించుకోవచ్చు అనేది ప్రధాన ఉద్దేశం. ఏదైనా విపత్తులు, ప్రమాదాలు జరిగినప్పుడు హెలికాప్టర్ ద్వారా సహాయ బృందాలను రంగంలోకి దింపిన సందర్భాలను గత బీఆర్ఎస్ పాలనలో చూశాం. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో హెలికాప్టర్ వాడకం గమనించి, “గాలిమోటర్‌ను ఇట్ల కూడా వాడుకోవచ్చా” అని జనం ఇచ్చంత్రంగా చూస్తున్నారు. కాంగ్రెస్ సర్కారులో మంత్రులు దాన్ని హెలికాప్టర్ అనుకుంటున్నారా? పల్లెవెలుగు బస్సు అనుకుంటున్నారా? అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోషల్ మీడియాలో సెటైర్లు పేలుతున్నాయి. ప్రభుత్వం దివాలా తీసిందని ముఖ్యమంత్రి సన్నాయి నొక్కులు నొక్కుతుంటే మంత్రులకు గాలిమోటర్ల సోకు ఎక్కువైందని కొందరు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. మరీ రెండు కిలోమీటర్లకు కూడా హెలికాప్టర్ వాడడం ఏందయ్యా? అంటూ నెటిజన్లు నిలదీస్తున్నారు.

మంత్రి సుడి ‘గాలి పర్యటనలు’

ఇటీవల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెలికాప్టర్ వినియోగం మితిమీరిపోయిందని ప్రభుత్వవర్గాల్లోనే చర్చ నడుస్తున్నది. హైదరాబాద్ నుంచి కాలు బయటపెట్టి కదులుతున్నారంటే చాలు బండి రెడీ అయిందా? అని కొందరు అధికారులు చమత్కారంగా మాట్లాడుకుంటున్నారట. బండి అంటే కారో, బస్సో, వ్యానో కాదని.. మంత్రి దృష్టిలో వాహనం అంటే హెలికాప్టరేనని ఎద్దేవా చేస్తున్నారట. తరచుగా మంత్రి పర్యటనలు సాగుతున్న తీరే ఇందుకు కారణమని కొందరు సహచర మంత్రుల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే శనివారం నాటి ఉత్తమ్ పర్యటనలో హెలికాప్టర్ వాడకంలో పరాకాష్ట ఏంటో చూపించారని కొందరు విమర్శిస్తున్నారు.

అమాత్యులు ఏయే ఊర్లు తిరిగారంటే!

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో పర్యటించారు. ఆదివారం జరగనున్న సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు అని చక్కర్లు కొట్టారు. ఉదయం 11 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరిన ఉత్తమ్ కోదాడకు వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం హుజూర్‌నగర్ రామస్వామిగుట్ట సమీపంలోని హౌసింగ్‌కాలనీకి వెళ్లారు. ఆ తర్వాత రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న సీఎం సభాస్థలానికి చేరుకుని, ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడి నుంచి మేళ్లచెరువుకు, అనంతరం నేరేడుచర్లలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి వెళ్లారు. అక్కడి నుంచి హైదరాబాద్ చేరుకున్నారు. మంత్రి హెలికాప్టర్‌లోనే వెళ్లాలనుకుంటే హైదరాబాద్ నుంచి కోదాడ వరకు హెలికాప్టర్‌లో వెళ్లొచ్చని, స్థానికంగా చిన్నచిన్న దూరాలకు కారు వాడుకుని, తిరిగి హెలికాప్టర్‌లో హైదరాబాద్ రావొచ్చు కదా అని కొందరు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. కానీ మంత్రి మాత్రం స్థానికంగానే కోదాడ నుంచి నేరేడుచర్ల మధ్య 59.5 కిలోమీటర్ల పర్యటన కోసం హెలికాప్టర్‌లో నాలుగుసార్లు ఎక్కిదిగడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. చిన్నచిన్న దూరాలకే మంత్రి గాల్లో ఎగురుకుంటూ ప్రయాణిస్తుంటే, అధికారులు కార్లలో ఉరుకులు, పరుగులు తీయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. శనివారం మాత్రమే కాదు ఈ మధ్యకాలంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గం హుజూర్‌నగర్, తన భార్య పద్మావతి నియోజకవర్గం కోదాడకు హెలికాప్టర్‌లోనే వెళ్తున్నారు. 15 నెలల్లోనే ఈ రెండు నియోజకవర్గాల పర్యటనకు దాదాపు పదిహేనుసార్లు హెలికాప్టర్‌లో వెళ్లారని తెలుస్తున్నది. ఎస్ఎల్‌బీసీ సహాయ చర్యల పరిశీలనకు కూడా ఉత్తమ్ హెలికాప్టర్‌లోనే వెళ్లారు. కరీంనగర్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నామినేషన్ కోసం మంత్రి కొండా సురేఖతో కలిసి ఉత్తమ్ కుమార్‌రెడ్డి హెలికాప్టర్‌లోనే ప్రయాణించారు. ఉత్తమ్ గాలిమోటర్ టూర్లు చూస్తున్న ప్రజలు నీటిపారుదలశాఖ మంత్రి... ప్రజధనాన్ని నీళ్లలా ఖర్చు చేస్తున్నారని ఎద్దేవా చేస్తున్నారు.

ఉత్తమ్ హెలికాప్టర్‌ను వాడిన విధంబెట్టిదనిన!

ఎక్కడి నుంచి	ఎక్కడి వరకు	ఎన్ని కి.మీ
హైదరాబాద్	కోదాడ	182
కోదాడ	రామస్వామిగుట్ట	16.5
రామస్వామిగుట్ట	సీఎం సభాస్థలి	2
సీఎం సభాస్థలి	మేళ్లచెరువు	11
మేళ్లచెరువు	నేరేడుచర్ల	30
నేరేడుచర్ల	హైదరాబాద్	164

మరో ఇద్దరు రైతుల ఆత్మహత్య

బజార్‌హత్నూర్/కాటారం, మార్చి 29 : దిగుబడులు రాక.. అప్పుల భారం మోయలేక మరో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా దేగామ గ్రామానికి చెందిన విఠల్ (54) తనకున్న మూడెకరాల్లో పత్తి వేశాడు. బ్యాంకులో, ప్రైవేటుగా కలిపి రూ.5 లక్షల అప్పుచేశాడు. సర్కారు బ్యాంకు రుణం మాఫీ చేస్తుందని ఆశపడ్డాడు. మాఫీకాక దిగులుతో శుక్రవారం పురుగుల మందు తాగాడు. తోటి రైతులు విఠల్‌ను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. విఠల్ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు.

మేకల విఠల్(ఫైల్), రవీందర్ (ఫైల్)

గంగారంలో రైతు రవీందర్

భూపాలపల్లి జిల్లా గంగారం గ్రామానికి చెందిన రైతు చల్ల రవీందర్ (43) రెండు ఎకరాల భూమితోపాటు మరో ఏడు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి, వరి సాగు చేశాడు. రూ.10 లక్షల వరకు అప్పు అయ్యింది. మనోవేదనకు గురై ఈ నెల 24న గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు కాటారంలో చికిత్స చేయించిన అనంతరం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి రవీందర్ మృతి చెందాడు.

వాణిజ్య

మేడ్చల్ ఫస్ట్.. ములుగు లాస్ట్

పరిశ్రమల అనుమతుల్లో భారీ తేడాలు.. 2024-25లో 1,476 ఇండస్ట్రీలకు ఓకే

హైదరాబాద్, మార్చి 29(నమస్తే తెలంగాణ): తయారీ రంగాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన టీఎస్ఐపాస్‌కి పారిశ్రామిక వర్గాల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నది. ఇదే క్రమంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1,476 పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి అనుమతులు మంజూరయ్యాయి. వీటిద్వారా రూ. 9,850 కోట్ల పెట్టుబడులు రానుండగా, తద్వారా 38,598 మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ పరిశ్రమల అనుమతుల్లో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ప్రథమ స్థానంలో నిలవగా ములుగు జిల్లా చివరిస్థానానికి పరిమితమైంది. మేడ్చల్‌లో 262 యూనిట్ల ఏర్పాటునకు సంబంధించి అనుమతులు లభించగా.. ములుగులో కేవలం 5 మాత్రం ఏర్పాటయ్యాయి. అలాగే, రూ.5,155 కోట్ల పెట్టుబడులు, 8,857 మందికి ఉపాధి అవకాశాలతో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నది. ప్రభ